# ముక్కోటి ఉత్సవాలకు రండి



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

భద్రాచలం, డిసెంబర్ 14: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలకు ముఖ్య అతిథిగా రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కార్యనిర్వహణాధికారి ఎల్.రమాదేవి ఆహ్వానించారు. మంత్రికి బుధవారం హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల 22న తెప్పోత్సవం, 23న ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు రావాలని కోరారు. మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. స్వామి వారి ప్రసాదాలు అందించారు. మంత్రికి అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రవీందర్ రాజు, అర్చకులు అమరవాది వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

## ‘సింగరేణి డే’లో స్టాల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు టౌన్, డిసెంబర్ 14: ఈ నెల 23న స్థానిక భద్రాద్రి స్టేడియంలో జరిగే సింగరేణి ఆవిర్భావ వేడుక(సింగరేణి డే)లో స్టాల్స్ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోగా దరఖాస్తులను పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో ఇవ్వాలని పేర్కొన్నారు.

**ఉత్తమ హరిత గృహాల ఎంపికకు..**

సింగరేణి డే వేడుకల్లో భాగంగా మణుగూరు ఏరియా పీవీ కాలనీ, బంగ్లాస్ ఏరియాలోని కంపెనీ క్వార్టర్లలో ఉత్తమ హరిత గృహాలను సంబంధిత కమిటీ ఎంపిక చేస్తుందని డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ 20వ తేదీన పర్యటిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తిగల ఉద్యోగులు తమ పేర్లను ఈ నెల 19వ తేదీ లోపు జీఎం కార్యాలయంలోని పర్యావరణ విభాగంలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్న గృహాలలో అత్యుత్తమైన వాటిని ఎంపిక చేస్తుందని, వీటికి బహుమతులను ఆవిర్భావ వేడుకల్లో జీఎం దుర్గం రామచందర్ ప్రదానం చేస్తారని వివరించారు.

## మాజీ కళాకారుడికి సత్కారం

భద్రాచలం, డిసెంబర్ 14: కళారంగానికి అందించిన విశిష్ట సేవలకుగాను ప్రజానాట్య మండలి మాజీ కళాకారుడు గడ్డం అశోక్‌ను ఇటీవల కాకతీయ మహానంది పురస్కారం వరించింది. ఈ సందర్భంగా ఆయనను సీపీఎం నాయకులు గురువారం సన్మానించారు. జీఎస్ శంకర్రావు, గడ్డం స్వామి, ఎంబీ నర్సారెడ్డి, ఐ.వెంకటేశ్వరరావు, ప్రజానాట్య మండలి బాధ్యులు గౌతమి, బి. వెంకటరెడ్డి, వైవి.రామారావు, విజయ్‌కుమార్, లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

## రేపు ప్రజాపంథా జిల్లాస్థాయి సదస్సు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 14 : మూడు విప్లవ పార్టీలు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఎంఎల్ రెవెల్యూషనరీ పార్టీ, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీలు విలీనమై ఒకే పార్టీగా ఏర్పడాలని నిర్ణయించినట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. గురువారం రైటర్‌బస్తీలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పార్టీల విలీన సభల విజయవంతం కోసం ఈ నెల 15న పట్టణంలోని ఉర్దూఘర్‌లో జిల్లా సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2024 మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో భారీ ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు నాయిని రాజు మాచర్ల సత్యం, జాటోతు కృష్ణ, ఎదలపల్లి ఆజాద్, ఏదులాపురం గోపాలరావు, బానోతు ధర్మా, పి.సతీష్, రాంచందర్, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక గొంతుక టీబీజీకేఎస్‌ను గెలిపించండి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

మణుగూరు టౌన్, డిసెంబర్ 14: సింగరేణి కార్మికుల గొంతుకగా నిలిచిన టీబీజీకేఎస్‌ను గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు కోరారు. కేసీ హెచ్‌పీ గేట్ వద్ద గురువారం మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. వారసత్వ ఉద్యోగాలను నాటి సీఎం చం ద్రబాబు నాయుడు వద్ద జాతీయ కార్మిక సంఘాలు తాకట్టు పెట్టాయని విమర్శించారు. దానిపై కేసీఆర్ ప్రభుత్వంతో టీబీజీకేఎస్ మాట్లాడి, తిరిగి సాధించిందని చెప్పారు. కేసీఆర్ చలవతోనే సింగరేణిలో యువ రక్తం కనిపిస్తున్నదని అన్నారు. 125కు పైగా మెడికల్ బోర్డులు నిర్వహించినట్లు, మణుగూరు ఏరియాలో 400కు పైగా కా రుణ్య నియామకాలు అందించినట్లు చెప్పారు. 44 మందికి పైగా కార్మికులు ఉద్యోగానికి బదులు గా రూ.25లక్షలు తీసుకున్నారని చెప్పారు. కోలిండియాలో ఈ విధానం లేదని, టీబీజీకేఎస్ కృషితో సింగరేణిలో మాత్రమే అమలవుతున్నదని అన్నారు. టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే మరిన్ని హక్కులు, ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, వెంకటేశ్వరరెడ్డి, కాపా శివాజీ, డీవీ రాజబాబు, రాజన్, బాలాజీ, రామారావు, ప్రవీణ్, పీక శంకర్, అజిత్, ముత్యం, ఆదిశంకర్ పాల్గొన్నారు.

## ‘సింగరేణి డే’ ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జీఎం దుర్గం రామచందర్

మణుగూరు టౌన్, డిసెంబర్ 14: భద్రాద్రి స్టేడియంలో ఈ నెల 23న జరగనున్న సింగరేణి డే ఏర్పాట్లను ఏరియా జీఎం దుర్గం రామచందర్ గురువారం పరిశీలించారు. హాజరయ్యే సింగరేణీయులు, పుర జనులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అన్నారు. వేడుకలు ఆసాంతం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, రమేష్, మధుసూదన్, శోభన్‌బాబు, సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పోరాడాలి



మాజీ ఎమ్మెల్యే రేగాతో మాట్లాడుతున్న ఎంపీ కవిత

కరకగూడెం, డిసెంబర్ 14: ప్రజల సమస్యలపై వారి పక్షాన పోరాడదామని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును మండలంలోని కుర్నవల్లి గ్రామంలోగల ఆయన స్వగృహంలో ఆమె గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఓటమికి గల కారణాలను తెలుసుకున్నారు. ఓటమిని లెక్కచేయవద్దని, ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడాలని అన్నారు. ఎంపీపీ రేగా కాళిక, బూర్గంపహాడ్ జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, నాయకులు బిక్కసాని శ్రీనివాసు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ‘తపాల’ సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 14 : గ్రామీణ తపాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడోరోజుకు చేరుకుంది. ఉద్యోగుల సంఘం నాయకుడు టి.విజయరాజు మాట్లాడుతూ కమలేష్‌చంద్ర కమిటీ నివేదికలోని సానుకూల అంశాలను నెరవేరుస్తామన్న హామీని కేంద్రం నిలుపుకోలేదని విమర్శించారు. నాయకులు ఎంఎ.ఖాన్, ఎం.వెంకటేశ్వర్లు, వాహబ్, షేక్ ఖలీల్, వెంకటకృష్ణ, వినయ సుధీర్, శ్రీను, లక్ష్మి, భారతి, సాహిత్య, రిజ్వాన, స్నేహషీలా, అమృత పాల్గొన్నారు. డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

## కూర్మావతారంలో రామయ్య



తిరువీధి సేవలో అర్చకులు, భక్తులు

పర్ణశాల, డిసెంబర్ 14: ముక్కోటి అధ్యయనోత్సవాల రెండోరోజు గురువారం పర్ణశాల రామయ్య భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారికి సాయంత్రం తిరువీధి సేవను అర్చకులు శేష కిరణ్ కుమారాచార్యులు, అమరవాది శ్రీకాంతాచార్యులు, నరసింహాచార్యులు, భార్గవాచార్యులు నిర్వహించారు. ఏఈవోలు శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ కిషోర్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలు

సారపాక, డిసెంబర్ 14: హైదరాబాద్‌కు చెందిన పిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక సీఎఫ్‌సీ చర్చిలో గురువారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. బూర్గంపహాడ్, భద్రాచలం, ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, అల్లూరు సీతారామరాజు జిల్లా ఎటపాక, వీఆర్ పురం, కూనవరం, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు చెందిన 200 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు, ఆర్థిక సాయాన్ని పిలోహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ మోజెస్ అందజేశారు.

## ఆటోలు వెలవెల.. డ్రైవర్లు విలవిల



ఉపాధి కోల్పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

చర్ల, డిసెంబర్ 14: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం.. తమ ఉపాధిని దెబ్బతీస్తున్నదని మండలంలోని ఆటోల డ్రైవర్లు విలవిల్లాడుతున్నారు. ఆడవారికి ఉచిత ప్రయాణం ఉండడంతో వారి కుటుంబీకులైన మగవారు కూడా బస్సుల్లోనే ప్రయాణించేందుకు ఇష్టపడుతున్నారని చెప్పారు. ‘‘మహిళలే కాదు.. మగవారు కూడా మా ఆటోల వైపు చూడడం లేదు’’ అని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, తమ పరిస్థితిని కూడా ప్రభుత్తవం అర్థం చేసుకోవాలని వేడుకుంటున్నామని అంటున్నారు.

## మంత్రులను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి పొంగులేటితో కాంగ్రెస్ నాయకులు

సారపాక, డిసెంబర్ 14: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ చంద్ర సంతోష్‌కుమార్, తాళ్లూరి చంద్రశేఖర్, చక్రవర్తి, మహమ్మద్ ఖాన్, కొమ్ము నాగేంద్ర గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. శాలువాలు కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సన్మానించారు. నాయకులు బషీరుద్దీన్, లతీఫ్, అబ్దుల్ నబీ, మీరా, గౌస్‌పాషా, రహీం, ఇమ్రాన్, ఖాసీం, యాకూబ్ పాల్గొన్నారు.

## హోమియో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో డాక్టర్ పూజ, సిబ్బంది

చర్ల, డిసెంబర్ 14: మండలంలోని మొగళ్ళపల్లి గ్రామంలో గురువారం హోమియో వైద్య శిబిరాన్ని చర్ల(కొయ్యూరు) పీహెచ్‌సీ హోమియో డాక్టర్ పూజ నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న అనేకమంది ఈ శిబిరానికి వచ్చారు. వారిని డాక్టర్ పూజ పరీక్షించి మందులు ఇచ్చారు.

## ‘ఏకలవ్య’ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వీరాస్వామి

దుమ్ముగూడెం, డిసెంబర్ 14: మండలంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు సత్తుపల్లికి చెందిన న్యాయవాది టి.బ్రహ్మాజి పంపిన దుస్తులను గురువారం ప్రిన్సిపాల్ వీరాస్వామి పంపిణీ చేశారు. ఈ పాఠశాలలోని సింగిల్ పేరెంట్ విద్యార్థులు 25 మందికి ఏదో ఒక రూపంలో సాయం చేయాలని ఇక్కడి హిందీ ఉపాధ్యాయుడు తాటి నాగేశ్వరరావు, తన చిరకాల మిత్రుడైన అడ్వకేట్ బ్రహ్మాజీని కోరారు. దీనికి ఆయన స్పందించి, తన జన్మదినం సందర్భంగా ఈ దుస్తులను పంపారు.

## సామూహిక సీమంతాలు

సారపాక, డిసెంబర్ 14: పోషణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రాజీవ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహికంగా సీమంతాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి గురువారం నిర్వహించారు. ఏఎన్‌ఎం గోపమ్మ, ఆశా వర్కర్లు సంధ్య, నిహారిక, అంగన్‌వాడీ టీచర్లు విజయ, నాగవేణి పాల్గొన్నారు.